పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్య ధోరణితో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే షల్టన్ హోటల్ - గోరక్షణపేట రోడ్‌లో ఏర్పడిన భారీ గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెంత మంది క్షతగాత్రులుగా మారాలని వాపోతున్నారు. అధికారులు ఉదాసీనతను వీడి మరమ్మతులు చేపట్టే దిశగా దృష్టి సారించాలని విన్నవిస్తున్నారు.

- షల్టన్ రోడ్‌లో దెబ్బతిన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- భారీ గోతులతో జనం అవస్థలు
- నిత్యం ప్రమాదాలు..పెరుగుతున్న క్షతగాత్రులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలో అత్యంత రద్దీగా ఉండే హోటల్ షల్టన్ నుంచి జాగృతి బ్లడ్ బ్యాంక్, గోరక్షణపేటకు వెళ్లే రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ దెబ్బతినడంతో శీలం సూకరాజు కాంప్లెక్స్ నుంచి హోటల్ షల్టన్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో రెండు చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో నగర ప్రజలతో పాటు వివిధ పనులపై నగరానికి వచ్చే పరిసర గ్రామాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అండర్ గ్రౌండ్ దెబ్బతిని గోతులు పడడంతో నగరపాలక సంస్థ అధికారులు తూతూ మంత్రంగా గ్రీన్ మ్యాట్ కట్టి చేతులు దులిపేసుకున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిలో ఏర్పడిన గోతులు చోదకులకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ఈ మార్గంలో రాత్రి సమయంలో ప్రయాణించాలంటే సాహసంగా మారుతోంది. హోల్‌సేల్ వస్త్ర వ్యాపార కేంద్రంగా భాసిల్లుతున్న మహాత్మా గాంధీ క్లాత్ కాంప్లెక్స్ రోడ్‌లో సైతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బతిని గోతులు పడడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. గోతులకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పట్టినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరానికి రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు సైతం ఈ ప్రాంతం నుంచి కాంప్లెక్స్‌కు చేరాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి వైద్యానికి దానవాయిపేట ఆసుపత్రులకు వచ్చే ప్రజలు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తారు. అధికారులు దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



షల్టన్ రోడ్‌లో ప్రమాదకరంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గోతులు

పట్టించుకునే వారు లేరు..



నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే షల్టన్ హోటల్-గోరక్షణ పేట రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బతినడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా దృష్టి సారించకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి. కమిషనర్ పర్యవేక్షణ జరిపి చర్యలు చేపట్టాలి. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో స్థానికులతో కలిసి ఫిర్యాదు చేస్తా.

– మార్తి లక్ష్మి , నగర మహిళా నాయకురాలు, రాజమహేంద్రవరం.

ప్రమాదాలు నిత్యకృత్యం..



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బతిన్నప్పటికీ అధికారులు చేపట్టిన చర్యలు అంతంత మాత్రమే. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఈ విధమైన దుస్థితి నెలకొన్నప్పటికీ జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవటం దారుణం. ప్రమాదాల నివారణకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి. ఈ రోడ్డుపై ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి.

– బైరెడ్డి జగదీష్ రెడ్డి, రాజమహేంద్రవరం.

నిధుల మంజూరుకు నివేదించాం..

రూ.1.20 కోట్లతో శీలం సూకరాజు కాంప్లెక్స్ నుంచి హోటల్ షల్టన్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టేందుకు నివేదికలు సిద్ధం చేశాం. నిధులు మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. మంజూరు అయిన వెంటనే టెండర్లు ఆహ్వానించి పనులు చేపడతాం.

పాండురంగారావు,
నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ ఎస్ఈ.

క్లుప్తంగా

79 వేల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం సాయంత్రం 79, 231 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 9.30 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 9,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కోదండ రామాలయ పునరుద్ధరణకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: కోదండ రామాలయం పునరుద్ధరణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక చందాసత్రం వీధిలో వైఎంవీఏ హాలు పక్కన గల కోదండ రామాలయం శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణం కోసం ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. శ్రీ విశ్వేశ్వర ఆలయ మాజీ చైర్మన్ మండవిల్లి శివ దంపతులు చేతుల మీదుగా శంకుస్థాపన గావించారు. కార్యక్రమంలో గన్ని కృష్ణ, అత్తి సత్యనారాయణ, వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడు మృతి తీరని లోటు




చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కాతేరులో ఆయన ఆచంట వెంకట సుబ్బారాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా సుబ్బారాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి మాజీ మంత్రి స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు, ఆచంట సుబ్బారాయుడుల అనుబంధం మరువ లేనిదన్నారు. కాతేరు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మాజీ వైస్ఎంపీపీ నక్కా రాజాబాబు, టీడీపీ నేతలు గన్ని కృష్ణ, మార్ని వాసుదేవ్ తదితరులు ఆచంట వెంకట సుబ్బారాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముగిసిన కార్పొరేట్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

ప్రకాశం నగర్ : బజాజ్ గ్లాడియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజమండ్రి కార్పొరేట్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ఎస్పీ కార్యాలయం క్రికెట్ గ్రౌండ్‌లో ముగిసింది. రెండు నెలలుగా జరిగిన ఈ టోర్నమెంట్లో 8 జట్లు పాల్గొన్నాయి. వీటిలో ఎస్పీ 11, కలెక్టర్ 11 జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్పీ 11 జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 165 పరుగులు చేసి ప్రత్యర్థి జట్టు కలెక్టర్ 11 పై విజయం సాధించింది. ఈ పోటీలలో మ్యాన్ ఆఫ్ ద సిరీస్ గా వెంకటేష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రవి, బెస్ట్ బౌలర్ గా సిఐ వెంకటేష్ నిలిచారు. విజేతలకు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాలాజీ, జనసేన నగర అధ్యక్షులు వై. శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ తేజ, విన్నర్ జట్టు కెప్టెన్ సిఐ వెంకటేష్, రన్నర్ జట్టు కెప్టెన్ బాపిరాజు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: వెనమ్
శివజ్యోతి	: పొట్టేల్
అనుశ్రీ	: వెనమ్
స్వామి	: వెనమ్
అశోక	: విశ్వం
రాజా	: వెనమ్
రంభ	: సత్యం సుందరం, ప్రేమలో
ఊర్వశి	: లగ్గం
మేనక	: నరుడి బ్రతుకు నటన
కుమారి	: దేవర
అప్సర	: దేవర
నామవరం	
వీఎస్ మహల్	: వెనమ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: వెనమ్
కడియం	
వెంకటసూర్య	: వెనమ్

గోవింద క్షేత్రంలో వార్షిక పవిత్రోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు గోవింద క్షేత్రంలో ఈ నెల 27 నుంచి 30 వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీమన్నారాయణాచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఉత్సవారంభ స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాంగీకారం, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ, అంకురారోపణ, సోమ కుంభావాహన, పవిత్రాధివాసం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 28న ఉదయం 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, చతుస్థానార్చనలు, కుంభావాహన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్రారోహణ, ప్రాయశ్చిత్త హోమం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి, సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, నిత్యహోమాలు, మంగళాశాసనం, తీర్థగోష్ఠి నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం 8.30 గంటలకు చతుస్థానార్చనలు, నిత్య ప్రాయశ్చిత్త హోమాలు, మంగళా శాసనం, తీర్థగోష్ఠి సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, నిత్య విధి, మంగళాశాసనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 30న ఉదయం 8.30 గంటలకు నిత్యహోమం, మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, విశేషాలంకారాలు, కుంభప్రోక్షణ, మంగళాశాసనం, తీర్థగోష్ఠి, మహదాశీర్వచనం, పండిత సన్మానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు మట్టపల్లి రంగప్రసాద్ సోదరులు, డాక్టర్ బలభద్ర వెంకటరాజు, సుజాత దంపతులు, పులవర్తి లక్ష్మణస్వామి పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరాజు, సుజాత దంపతులు, పులవర్తి లక్ష్మణస్వామి

పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర సాంస్కృతిక రాజధాని కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరం ప్రాంతాన్ని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ రంగాలను సమ్మిళితం చేయటం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని గోదావరి నది బ్రిడ్జిలంకలో 'ఆహ్వానం కిచెన్ ఫ్రాంచైజీస్' ఆధ్వర్యంలో ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను ఆయన ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మరింత గుర్తింపు తెచ్చేందుకు త్వరలోనే హేవలాక్ బ్రిడ్జి సమీపంలోని గోదావరి తీరంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరాన్ని అందంగా తీర్చిదిద్దుతామన్నారు.

గోదావరి బ్రిడ్జిలంకలో ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను ప్రారంభించడం పర్యాటకులకు మధురానుభూతిని కలిగిస్తుందన్నారు. రాబోయే ఐదేళ్ల కాలానికి పర్యాటక రంగ అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని అవకాశాలు ఇక్కడ ఉన్నాయని మంత్రి తెలిపారు. స్టూడియోల నిర్మాణం జరిగి చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఏ. పద్మావతి, జనరల్ మేనేజర్ రాజారామ్, ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాసు, రాష్ట్ర టూరిజం బోర్డ్ సభ్యులు వాసిరెడ్డి రాంబాబు, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వి స్వామినాయుడు, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం పాల్గొన్నారు.



ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఫ్రీ సీట్ల కేటాయింపు జీవోను అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాజమహేంద్రవరంసిటీ: ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఫ్రీ సీట్లు కేటాయింపు జీవోను అమలు చేయాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరం గోరక్షణపేట కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలలో ఈ జీవో అమలు జరుగుతుండగా మన రాష్ట్రంలో గత మూడేళ్ల నుంచి అడ్మిషన్లపై స్పష్టత లేదన్నారు. డీఈవోలు సీట్ల కేటాయింపును తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తున్నప్పటికీ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని వాపోయారు. జీవోను అమలు చేయాలని కోరుతూ ఇటీవల ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం తరపున రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాయణ, మంత్రి నారా లోకేష్‌లకు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ జీవోను వెంటనే అమలు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం నాయకులు సుదీర్, అంబేద్కర్,రవి, రాజ్ కుమార్, దేవి, కరీముల్లా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా విజయవంతానికి పిలుపు



మహాధర్నా ఏర్పాట్లలో యూనియన్ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: అఖిల భారత జీవిత బీమా సంస్థ ఏజెంట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు జీవిత బీమా ఏజెంట్లు తరలి రావాలని రాజమహేంద్రవరం రూరల్ బ్రాంచ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా విజ్ఞప్తి చేశారు. మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద జరిగే ఈ ధర్నాకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. 68 ఏళ్లుగా ఎదుగు బొదుగు లేని కమిషన్‌తో వ్యాపారాలు చేస్తూ సంస్థ ఉన్నతికి పాటు పడుతున్న ఏజెంట్స్‌కు తీరని అన్యాయం జరుగుతున్న తరుణంలో సమైక్యతను చాట వలసిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఏజెంట్స్‌కు వస్తున్న కమీషన్‌ను పెంచమని కోరడం లేదని ఉన్న కమీషన్ తగ్గించవద్దని కోరుతున్నట్లు చెప్పారు.

డీవైఎఫ్ఐ జిల్లా కన్వినింగ్ కమిటీ ఎన్నిక



వి.రాంబాబు



డి.అశోక్ కుమార్



జి.ప్రసన్న కృష్ణ

కంబాలచెరువు: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) తూర్పు గోదావరి జిల్లా నూతన కన్వీనింగ్ కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు రెండు రోజుల పాటు బాలోత్సవ భవన్‌లో జరిగాయి. రెండో రోజు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం జిల్లా నాయకులు డి.అశోక్ కుమార్ పేర్లు ప్రతిపాదించగా సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పేర్లను పత్రికలకు విడుదల చేశారు. జిల్లా కన్వీనర్‌గా వి.రాంబాబు, కో-కన్వీనర్స్‌గా డి.అశోక్ కుమార్, జి.ప్రసన్న కృష్ణలు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఏ.రవి, కే.నాని, ఎస్.కె.షాను, టి.వెంకటేష్, టి.రాజేష్, ఎం.జోసఫ్, జె.ఆనంద్, డి.శేషారావు, ఎస్.సాయి ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సంఘం జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, కో-కన్వీనర్స్ డి.అశోక్ కుమార్, జి.ప్రసన్న కృష్ణలు మాట్లాడుతూ జిల్లాలో యువత ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. నిరుద్యోగ సమస్యను అధికమించకపోతే దేశం అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ ఫలితం సమాజం మీద తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను గాలికి వదిలేయకుండా తగిన కృషి చేయాలని డిమాండ్ చేశారు.

కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి



కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ప్రకాశం నగర్ : కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్‌చైర్మన్ జి చంద్రశేఖరరావు, అధ్యక్షుడు పి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి బురిడి త్రిమూర్తులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రౌతు కల్యాణ మండపంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు ఏఎం అర్జునరావు, కోశాధికారి ఎం సుబ్బరాజులు హాజరు కాగా నూతన కార్యవర్గం ఎన్నికకు ఎన్నికల అధికారిగా కె రామారావు వ్యవహరించారు. తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం చైర్మన్‌గా జి చంద్రశేఖరరావు, ప్రెసిడెంట్‌గా పి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా బురిడి త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా ఇయ్యపు మాధవ్, పి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా బి ఏలియా, బి అర్జుబాబు, కోశాధికారిగా ఎస్‌వి కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె వీరరాజు, కె కృష్ణలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రాజమహేంద్రవరం సిటీ మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అభినందించారు. జిల్లాలో కబడ్డీ క్రీడ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. జిల్లాలో కబడ్డీ క్రీడ పూర్వ వైభవానికి కృషి చేస్తామని ఎన్నికైన వారు తెలిపారు. రాష్ట్ర నాయకులు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేస్తున్నామని, అందుబాలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి ఎస్ నాగరాజు, కోశాధికారి వీరబాబు, ఉపాధ్యక్షులు వి శ్రీనివాస్, వీటీ కళాశాల పీడీ కిశోర్‌బాబు, రిటైర్డ్ పీఈటీ శీర గంగాధర్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, తలుపూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: విద్యార్థులు నిత్య జీవితంలో ప్రతి అంశాన్ని పరిశీలన చేయాలని, సైన్స్ కోణంలో పరిష్కారాలను అన్వేషించాలని తద్వారా జ్ఞానాన్ని సముపార్జించ గలుగుతారని జిల్లా విద్యాశాఖ అధికారి కే. వాసుదేవరావు చెప్పారు. జన విజ్ఞాన వేదిక తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్ బ్రాంచ్ గౌతమి స్మార్ట్ స్కూల్‌లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో వాసుదేవరావు హాజరై మాట్లాడారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకుంటారని కనుక ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజలు, విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని, అభిరుచిని పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి విశాఖపట్నంలో నవంబర్ 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు హాజరైన అన్ని మండలాల మండల స్థాయి విజేతలకు, కన్వీనర్లకు అభినందనలు తెలిపారు. జేవీవీ నాయకులు సి.హెచ్. శ్రీరాములు సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. అనంతరం డీఈవో వాసుదేవరావు విద్యార్థులకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్. చైతన్య శేఖర్, శ్రీ గౌతమి స్కూల్ ప్రిన్సిపల్ ఎం. శ్రీధర్, జెవివి నాయకులు ఎ. సుధారాణి, జి.తాతారావు, సి.హెచ్. శ్రీరాములు, సి.హెచ్.నిశ్చల్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు, మెడల్స్‌తో చెకుముకి సైన్స్ సంబరాల విజేతలు

ముగిసన అఖండ జపమాల ప్రార్థనలు

మధురపూడి: ఆర్‌సీఎం చర్చిల్లో క్రీస్తు తల్లి మేరీమాతను ప్రార్థిస్తూ నిర్వహిస్తున్న అఖండ జపమాల ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కోరుకొండ, జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రెవరెండ్ ఫాదర్లు బి. మనోజ్ కుమార్, మాణిక్యం ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జపమాల ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం రెవరెండ్ ఫాదర్లు వాక్య సందేశం చేశారు. కార్యక్రమంలో కోరుకొండ మండలంలోని బూరుగుపూడి, కోరుకొండ, కాపవరం తదితర గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం ఆర్‌సీఎం చర్చిలో జపమాల ప్రార్థనలు

నేత్రానందంగా అయ్యప్ప పడిపూజ

రాజానగరం: మండలంలోని చక్రద్వార బంధంలో అయ్యప్ప స్వామి దీక్షాదారులు ఆదివారం రాత్రి నిర్వహించిన పడిపూజ నేత్రానందంగా జరిగింది. ఉదయం గణపతి హోమం జరిపి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం గ్రామంలో పేడతుళ్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చక్రద్వార బంధం, వెలుగు బంద, నరేంద్రపురం, నందరాడ, రాజానగరం, తూర్పు గానుగూడెం, కానవరం, తోకాడ, పల్ల కడియం, రామస్వామి పేట, ఫరిజల్లిపేట, దివాన్ చెరువు తదితర గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు భారీగా తరలి వచ్చారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాలు లైసెన్సు కలిగిన వారు మాత్రమే ప్రభుత్వ నియమ నిబంధలనకు లోబడి చేయాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ సూచించారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా కారణంగా ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో డీఎస్పీల పర్యవేక్షణలో బాణాసంచా దుకాణాలు, గొడౌన్‌లలో ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భద్రతా చర్యలపై ఆరా తీశారు.